### యౌవ్వనులకు మరియు పెద్దలకు

# మిషను పొలపు వార్తలు

### దక్షిణ ఆసియా-పసిఫిక్ డివిజను



### నాల్గవ  త్రిమాసము

### అక్టోబరు, నవంబరు, డిశంబరు - 2025

అనువాదం :

**డాఫోడిల్ & ఎమరాల్డ్**





# పడవలో అపరిచితుడు

## జామిల్లీ– బ్రెజిల్

ఒక అపరిచితుడు తన ఇంటి బయట కనిపించి, తనను "హలో" అని పిలిచినప్పుడు, 'జామిల్లీ'కి కొంచెం భయం అన్పించింది. బ్రెజిల్‌లోని అమెజాన్ నది ఒడ్డున ఉన్న మారుమూల గ్రామంలోని ఏ ఇంటికైనా అపరిచితులు సాధారణంగా రావడం జరుగదు.

జామిల్లీ తల్లిదండ్రులు పని మీద బయటకు వెళ్ళారు. 20 సంవత్సరాల వయసున్న ఆమె, తన నాలుగేళ్ళ తమ్ముడితోపాటు ఇంట్లోనే ఉన్నది. ఆ అపరిచితుడు తనను తాను పరిచయం చేసుకొని, తన పేరు పాస్టర్ కాస్సీయని, తాను సెవెంత్ డే ఎడ్వెంటిస్టు చర్చి నుండి వచ్చియున్నానని చెప్పాడు. ఆయన జామిల్లీతో మాట్లాడుతూ "తల్లిదండ్రులతో మీ సంబంధం ఎలా ఉన్నది" అని ఆమె జీవితం గురించి అడిగాడు.

"వారితో నాకు అంతమంచి సంబంధం లేదు" అని జామిల్లీ బదులు చెప్పింది. పాస్టర్ కాస్సీ ఆమెతో కొంతసేపు మాట్లాడిన తర్వాత ఆమెలో ఉన్న భయం తొలగిపోయి ఆమె కన్నీళ్ళు పెట్టుకున్నది. తన తల్లిదండ్రులతో మెరుగైన సంబంధాలు కలిగి ఉండాలనుకుంటున్నానని చెప్పింది.

అప్పుడు పాస్టర్ కాస్సీ ఆమెతో "మీరు తేలియాడే చర్చిలో జరిగే ప్రార్థనా సమావేశాలకు రావాలనుంటున్నారా? ప్రార్థనా కార్యక్రమంలో పాల్గొనాలనుకుంటున్నారా?" అని అడిగాడు. తన గ్రామానికి ఒక పెద్ద తెల్లని పడవ రావడం జామిల్లీ చూచింది. అయితే, ఆ పడవ వేరే క్రైస్తవ సంస్థకు చెందినదై, గ్రామ ప్రజలకు ఉచిత వైద్యం అందించే వైద్యులు మరియు నర్సులను తీసుకొని వచ్చిందని భావించింది.

కానీ, ఇప్పుడు ఆ పడవలో సెవెంత్ డే ఎడ్వెంటిస్టు చర్చి ఉన్నదని మరియు పాస్టర్ కాస్సీ, అతని బృందము కూడా పడవలోనే నివసిస్తున్నారని జామిల్లీ గ్రహించింది. పాస్టర్ కాస్సీ, ఇంటింటికి వెళ్ళి ప్రజలతో పరిచయం చేసుకొని వారితో స్నేహం చేయడానికి మరియు తేలియాడే చర్చిలో జరిగే ప్రార్థనా సమావేశములకు వారిని ఆహ్వానించుటకు వెళ్ళుచున్నాడు.

జామిల్లీ, పాస్టర్ కాస్సీ ఆహ్వానం మేరకు తేలియాడే చర్చికి వెళ్లడానికి అంగీకరించింది. తర్వాత ఆమె తన తండ్రిని తల్లిని జ్ఞాపకం చేసుకొని మళ్ళీ కన్నీళ్ళతో విలపించింది. రెండు సంవత్సరాల క్రితం ఆమె తల్లిదండ్రులు విడాకులు తీసుకున్నారు. వారిలో తనకున్న కష్టతరమైన సంబంధమును గుర్తు చేసుకొనెను.

పాస్టర్ కాస్సీ, ఆమె కథను విన్నాడు. ఆమెకు ఓదార్పు, ప్రోత్సాహం మరియు ఆదరణకరమైన మాటలు చెప్పాడు. జామిల్లీ మరలా కొంతసేపు ఏడ్చింది. అప్పుడు పాస్టరు ఆమెతో 'మనం ప్రార్థన చేద్దాము" అని చెప్పి ప్రార్థన చేశాడు.

ఆ రోజు నుండి జామిల్లీ, తన తల్లిదండ్రుల కోసం ప్రార్థించడం ప్రారంభించింది. ప్రతి సాయంత్రం తేలియాడే చర్చికి కూడా వెళ్ళింది. కుటుంబ సంబంధాలు, ఆరోగ్యం మరియు బైబిలును గురించి ప్రసంగాలు వినుటయందు ఆనందించింది. అంతేకాక, తనతో పాటుగా రమ్మని తన తల్లిని కూడా తేలియాడే చర్చికి ఆహ్వానించింది. తల్లి అందుకు అంగీకరించి జామిల్లీతో పాటు చర్చికి వెళ్ళింది.

దాదాపు ఒక నెల తరువాత జామిల్లీ, బాప్తిస్మం ద్వారా తన హృదయమును యేసుక్రీస్తుకు

సమర్పించుకొనెను. అది ఆమె జీవితంలో అత్యుత్తమమైన రోజు. ఆమె మరియు ఆమె పాపములు అమెజాన్ నది నీటిలో పాతి పెట్టబడ్డాయి. ఆమె నూతన జన్మ పొందిన క్రీస్తు బిడ్డగా వెలుపటకు వచ్చింది. జామిల్లీతో పాటు ఆమె ఉండే గ్రామంలోని ప్రజలు అనేకమంది గ్రామస్థులు కూడా బాప్తిస్మం తీసుకున్నారు.

బాప్తిస్మం తరువాత, తేలియాడే చర్చిలో జరిగే ప్రార్థనా సమావేశాలు, ఆ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎడ్వెంటిస్టు చర్చి భవనంలోకి మార్చబడ్డాయి. జామిల్లీ మరియు ఇతర గ్రామస్థులు తేలియాడే చర్చిలో జరిగే మీటింగులకు హాజరవుచుండగానే, భవన నిర్మాణ పనివారు చర్చిని నిర్మిస్తుండేవారు.

జామిల్లీ ప్రతివారం సబ్బాతు దినమందు జరుగు ఆరాధనా కార్యక్రమానికి హాజరగుచుండేది. అలాగే ఆదివారం, మరియు బుధవారం రాత్రులలో జరిగే ప్రార్థనా సమావేశాలకు కూడా వెళ్ళుచుండేది. నూతనంగా బాప్తిస్మం తీసుకున్న సంఘ సభ్యులు యేసుక్రీస్తు తమకోసం చేసిన వాటిని ఇతరులతో పంచుకొనుటను నేర్పించే "డిసైపుల్ ట్రైనింగ్ (శిష్యత్వ శిక్షణ) అను కార్యక్రమంలో జామిల్లీ పాల్గొనెను.

కానీ, జామిల్లీకి తన తల్లిదండ్రులతో ఆమెకున్న సంబంధం మెరుగుపడినట్లు కనిపించలేదు. గ్రామంలో చర్చి ప్రారంభం అయ్యాక, తేలియాడే చర్చి అక్కడ నుండి మరొక గ్రామానికి వెళ్ళిపోయింది. తరువాత జామిల్లీ యొక్క తల్లి చర్చికి వెళ్ళడం మానివేసింది. ఆమె తండ్రి అసలు చర్చికే వెళ్ళడు. సమస్యలు అధికమయ్యాయి. కానీ జామిల్లీ ప్రార్థన చేస్తూనే ఉన్నది.

ఒకరోజున జామిల్లీ తండ్రి వారి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎడ్వెంటిస్టు చర్చికి హాజరయ్యాడు. ఆ సమయంలో జామిల్లీ ప్రయాణం చేస్తూ, తన ఇంటికి చాలా దూరంలో ఉన్నది. ఆ విషయాన్ని ఆమె స్నేహితులలో ఒకరు ఫోన్ చేసి జామిల్లీకి చెప్పారు. ఆ వార్త విని జామిల్లీ ఆనందంతో గంతులు వేసింది. దేవుడు తన ప్రార్థనలు వింటున్నాడని ఆమెకు తెలుసు. దేవుడు తన కుటుంబాన్ని తన యొద్దకు మరలా తీసుకొని వస్తాడని కూడా ఆమెకు తెలుసు.

జామిల్లీ బాప్తిస్మం తీసుకొని ఒక సంవత్సరం గడిచింది. ఆమె "వన్ ఇయర్ ఇన్ మిషన్" అనే చర్చి కార్యక్రమం ద్వారా, మిషన్ వాలంటీర్ కావడానికి సిద్ధమవుతున్నది. ఈ కార్యక్రమమందు యువతీ, యువకులు ఒక సంవత్సరం పాటు మిషన్ పనిలో గడుపుతారు. పాస్టర్ కాస్సీ తన గ్రామానికి వచ్చి, సువార్తను తన గ్రామస్థులకు బోధించినట్లే, బ్రెజిల్, పరిసర ప్రాంతాలకు సువార్తను తీసుకువెళ్ళాలని జామిల్లీ కోరుకొనుచున్నది.

"దేవునికి సేవ చేయాలనే మీ కలలను ఎన్నడూ విడిచి పెట్టవద్దు" అని జామిల్లీ చెప్పుచున్నది.

క్వార్టర్లీ మిషన్ ప్రాజెక్ట్ ఆఫరింగ్ అని కూడా పిలువబడే 2016వ సంవత్సరపు సబ్బాతు కానుకల ద్వారా కొనుగోలు చేయబడిన తేలియాడే చర్చి అమెజాన్ నదీ తీర ప్రాంతంలో ఉన్న జామిల్లీ వంటి వారికి నిరీక్షణను కలిగించుచున్నది. ఈ త్రిమాసపు 13వ సబ్బాతు ప్రాజెక్టుల కొరకు మీ ప్రార్థనలతో పాటు కానుకలు సమర్పించుట ద్వారా, బ్రెజిల్, చిలీ దేశాలలో యేసుక్రీస్తు రాకడను గూర్చిన నిరీక్షణ ప్రకటించగలము.

–ఆండ్రూ మెక్ ఛెస్నీ